**పీడీఎస్ బియ్యం పట్టివేత**







**రూ.లక్షలు వెచ్చించి.. వృథాగా వదిలేసి..**



AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in


## ఎల్లారెడ్డి డిప్యూటీ డీఎంహెచ్‌వోగా హిమబిందు



**అక్షరటుడే, లింగంపేట:** లింగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు హిమబిందు సోమవారం ఎల్లారెడ్డి డిప్యూటీ డీఎంహెచ్‌వోగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రోగులకు వైద్యసేవలు అందేవిధంగా తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా లింగంపేట ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ఆమెను శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో ఫరీదా, రమేశ్, యాదగిరి, ప్రదీప్, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.





## జలాశయాలకు వరద తగ్గుముఖం

**అక్షరటుడే, మెండోరా/ఎల్లారెడ్డి :** ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని జలశయాలకు వరద తగ్గుముఖం పట్టింది. శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో తగ్గింది. ఎస్సారెస్పీలోకి ఎగువ నుంచి వస్తున్న వరద తగ్గడంతో అధికారులు వరద గేట్లను మూసివేశారు. ఎస్కేప్ గేట్ల ద్వారా నీటి విడుదలను కొనసాగిస్తున్నారు. ఎస్కేప్ గేట్ల ద్వారా 8 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువకు 650 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఆవిరి రూపంలో 573 క్యూసెక్కులు పోతోంది. కాకతీయ, లక్ష్మి కాలువలకు ప్రస్తుతం నీటి విడుదలను నిలిపివేశారు. జలాశయం నీటినిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం అంతేస్థాయిలో నీరు నిల్వ ఉంది.


### నిజాంసాగర్‌కు..

నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి స్వల్పంగా ఇన్‌ఫ్లో వస్తోంది. జలాశయంలోకి ప్రస్తుతం 2,498 క్యూసెక్కుల వరద వస్తుండగా.. అధికారులు ఒక గేట్ ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 17.8 టీఎంసీలు కాగా.. అంతేమొత్తంలో నీరు నిల్వ ఉంది.



## ప్రజావాణికి 94 ఫిర్యాదులు

**అక్షరటుడే, ఇందూరు:** ప్రజావాణికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. నగరంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 94 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, జిల్లా పరిషత్ సీఈవో సాయాగౌడ్, నగర పాలక సంస్థ సహాయ కమిషనర్ రవీంద్ర సాగర్, హౌసింగ్ పీడీ పవన్ కుమార్, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డిలకు అర్జీలు సమర్పించారు. కాగా.. ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.



## ఈవీఎం గోదాం పరిశీలన

**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పరిశీలించారు. ప్రతినెలా సాధారణ తనిఖీల్లో భాగంగా గోదాంను పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ విక్టర్, ఆర్డీవో వీణ, తహశీల్దార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## ఆస్తి సంబంధిత నేరాలపై దృష్టి పెట్టాలి



**అక్షరటుడే, కామారెడ్డి:** ఇటీవల జిల్లాలో జరుగుతున్న ఆస్థి సంబంధిత నేరాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, దొంగతనాలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. సోమవారం రాత్రి ఆయన రాజంపేట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో రోల్ కాల్ పరిశీలించి, సిబ్బంది హాజరు, క్రమశిక్షణ, సమయ పాలనపై సూచనలు చేశారు. ఆయన వెంట ఏఎస్పీ చైతన్య రెడ్డి, భిక్కనూరు సీఐ సంపత్, ఎస్సై రాజు, సిబ్బంది ఉన్నారు.

**విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా ఓ ఉపాధ్యాయుడు ప్రజాప్రతినిధి వద్ద పీఏగా పనిచేస్తున్న ఘటనపై నిజామాబాద్ డీఈవో అశోక్ ఎట్టకేలకు స్పందించారు. సదరు ఉపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డిపై చర్యలకు ఉపక్రమించారు. అనధికారికంగా సెలవులో ఉండడమే కాకుండా.. ఎమ్మెల్యే వద్ద పీఏగా పనిచేస్తున్న ఉదంతంపై కఠిన చర్యలకు ఉపక్రమించారు. సత్వరమే వివరణ ఇవ్వాలని శ్రీనివాస్ రెడ్డికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దీంతో ఎమ్మెల్యే పీఏపై అతిత్వరలోనే శాఖాపరమైన చర్యలు ఉండవచ్చని తెలుస్తోంది.** - అక్షరటుడే, ఇందూరు



# ఎమ్మెల్యే పీఏపై చర్యలు..

- షోకాజ్ నోటీసులు జారీ చేసిన డీఈవో అశోక్
- వెంటనే వివరణ ఇవ్వాలని ఆదేశం

విద్యాహక్కు చట్టం నిబంధనల ప్రకారం.. పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు ప్రజా ప్రతినిధులకు పీఏలుగా విధులు నిర్వహించకూడదు. ఈ విషయమై గతంలోనే సుప్రీంకోర్టు సైతం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. దీంతో అన్ని రాష్ట్రాలు సైతం ఉపాధ్యాయులను పీఏలుగా నియమించడంపై నిషేధం విధించాయి. కానీ నిజామాబాద్ జిల్లాలో మాత్రం పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. స్కూల్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి (జీవోల శ్రీనివాస్ రెడ్డి) నిజామాబాద్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి పీఏగా వ్యవహరిస్తున్నారు. వాస్తవానికి ఈయన పోస్టింగ్ ధర్పల్లి మండలం మైలారం ఉన్నత పాఠశాల.

కాగా.. రెండేళ్లుగా ఆయన పాఠశాలకు వెళ్లకుండా ముఖం చాటేశారు. సంబంధిత మండల ఎంఈవో వద్ద ప్రతి నాలుగు నెలలకోసారి సెలవులు పెట్టి.. ఎమ్మెల్యే వద్ద విధులు నిర్వహిస్తున్నారు. ఈ తంతు దాదాపు గత రెండేళ్లుగా కొనసాగుతోంది. పైపెచ్చు గతంలో జీతభత్యాలు కూడా జారీ చేయడం గమనార్హం.

### ఎంక్వైరీ అనంతరం..

శ్రీనివాస్ రెడ్డిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో డీఈవో అశోక్ విచారణ జరిపించారు. ఎంఈవోను రంగంలోకి దించి క్షేత్రస్థాయిలో ఎంక్వైరీ చేయించారు. కాగా.. ప్రతి నాలుగు నెలలకొకసారి శ్రీనివాస్ రెడ్డి అకారణంగా సెలవు పెట్టి వెళ్తున్నట్లు గుర్తించారు. తిరిగి ఒకరోజు విధుల్లో చేరి మరుసటి రోజే మళ్లీ నాలుగు నెలలు సెలవు తీసుకుని గత రెండేళ్లుగా ఎమ్మెల్యే వద్ద పీఏగా వ్యవహరిస్తున్నట్లు గుర్తించారు. ఈ విషయమై స్థానిక ఎంఈవో డీఈవోకు తుది నివేదిక అందించారు. 125 రోజులు అనధికారిక సెలవులో ఉండడమే కాకుండా ఎమ్మెల్యే వద్ద పీఏగా కొనసాగుతున్నట్లు నివేదికను సమర్పించారు. ఈ నివేదికను పరిశీలించిన డీఈవో అశోక్ ఎట్టకేలకు స్కూల్ అసిస్టెంట్, ఎమ్మెల్యే పీఏగా వ్యవహరిస్తున్న శ్రీనివాస్ రెడ్డికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఎలాంటి గడువు విధించకుండా సత్వరమే వివరణ ఇవ్వాలని నోటీసులో సూచించారు. వివరణ అనంతరం శ్రీనివాస్ రెడ్డిపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నారు.

### ఎంఈవో అండదండలు

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి వద్ద పీఏగా కొనసాగడం వెనుక స్థానిక ఎంఈవో అండదండలు ఉన్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేకు సొంత నియోజకవర్గంలో శ్రీనివాస్ రెడ్డి పనిచేసే పాఠశాల ఉండడంతో దాదాపు నెలల తరబడిగా ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారు. ఎమ్మెల్యేతో పలుమార్లు డీఈవో, ఎంఈవో అధికారికంగా వేదికలు పంచుకున్న సమయంలో సదరు ఉపాధ్యాయుడు శ్రీనివాస్ రెడ్డి అక్కడే ఉన్నా విద్యాశాఖ అధికారులు మాత్రం తమకేమీ తెలియదన్నట్లు వ్యవహరించారు. చివరకు ఓ వ్యక్తి దాఖలు చేసిన ఆర్టీఐ పిటిషన్, 'అక్షరటుడే'లో ప్రచురితమైన కథనాల ఆధారంగా విద్యాశాఖ అధికారులు స్పందించారు.

## పంట ఉత్పత్తుల కొనుగోళ్లను వేగవంతం చేయండి

**అక్షరటుడే, బోధన్:** కొనుగోలు కేంద్రాల ద్వారా పంట ఉత్పత్తుల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. బోధన్ మండలం బండార్ పల్లిలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని, కల్దుర్కిలో ధాన్యం సేకరణ కేంద్రాలను కలెక్టర్ సోమవారం సందర్శించారు. సోయాబీన్ సేకరణ కేంద్రంలో రైతుల నుంచి సేకరించిన సోయాబీన్ నిల్వల నాణ్యతను పరిశీలించారు. ఇప్పటివరకు ఎంత పరిమాణంలో సోయాబీన్ కొనుగోలు చేశారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ప్రాంతాల్లో సోయాబీన్, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రతి కేంద్రంలో సరిపడా గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలని, రవాణా పరమైన ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. అనంతరం కల్దుర్కి గ్రామంలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. రైస్‌మిల్లులకు ఎన్ని లోడ్‌ల లారీలు వెళ్లాయి. ట్రక్‌షీట్లు వెనువెంటనే తెప్పించుకుని ట్యాబ్ ఎంట్రీలు చేస్తున్నారా అని ఆరా తీశారు. ధాన్యం సేకరణ, మిల్లులకు తరలింపు వివరాలతో కూడిన రికార్డులను కలెక్టర్ పరిశీలించారు. ధాన్యం సేకరణ ప్రక్రియ తుది దశకు చేరినందున కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. పూర్తిస్థాయిలో ధాన్యం సేకరణ జరిగిన మీదట కొనుగోలు కేంద్రాలను మూసివేసే ముందు ట్రక్ షీట్‌లు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. 17 శాతానికి లోబడి తేమ ఉన్న ధాన్యాన్ని రైతులు కేంద్రాలకు తెచ్చిన వెంటనే తూకం జరిపించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అనవసర కాలయాపన కాకుండా, రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. కలెక్టర్ వెంట ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ సందీప్, మార్క్‌ఫెడ్ డీఎం మహేష్, బోధన్ తహశీల్దార్ విఠల్, కేంద్రాల నిర్వాహకులు ఉన్నారు.





## పేదల సొంతింటి కలను నిజం చేస్తున్నాం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పేదల సొంతింటి కలను నిజం చేస్తున్నామని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అన్నారు. మద్నూర్ మండల కేంద్రంలో లబ్ధిదారు గుడాల్వర్ సవిత నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవంలో సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఇందిరమ్మ ఇళ్లు కార్యరూపం దాలుస్తున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో నియోజకవర్గంలో ఒక్క డబుల్ బెడ్ రూం ఇల్లు కూడా మంజూరు కాలేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక జుక్కల్ నియోజకవర్గంలో మొదటి విడతలో 3,500 ఇళ్లు మంజూరు చేశామన్నారు. చాలా ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుని గృహప్రవేశాలు సైతం చేస్తున్నారని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల హామీని పూర్తి చేస్తున్నామన్నారు. జుక్కల్ నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఇసుక రవాణా అడ్డగింత.. ట్రాక్టర్ బోల్తా

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** ఇసుక అక్రమ రవాణాను అధికారులు అడ్డుకోగా.. వారిని తప్పించుకుని వెళ్తూ ఓ ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ఘటన కమ్మర్‌పల్లి మండలంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై అనిల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హాసాకొత్తూరు – కమ్మర్‌పల్లి రోడ్డులో ట్రాక్టర్‌లో ఓ వ్యక్తి ఇసుకను తరలిస్తున్నాడు. అయితే విధుల్లో భాగంగా హాసాకొత్తూర్ వీఆర్ఏ ట్రాక్టర్‌ను ఆపి ఎక్కడి నుంచి ఇసుకను తీసుకొస్తున్నావని డ్రైవర్ సాయికుమార్‌ను ప్రశ్నించాడు. భీమ్‌గల్ మండలంలోని కుప్కాల్ గ్రామంలోని ఒర్రె నుంచి ఇసుకను తెస్తున్నానని డ్రైవర్ పేర్కొన్నాడు. దీంతో వెంటనే వీఆర్వో.. ఆర్ఐ శరత్‌కు సమాచారం అందించాడు. ఆర్ఐ అక్కడికి చేరుకుని ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించే ప్రయత్నం చేయగా డ్రైవర్ వారిని తప్పించి వేగంగా ముందుకు వెళ్లాడు. అయితే కొద్దిదూరంలో అదుపుతప్పిన ట్రాక్టర్ బోల్తా పడింది. డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ట్రాక్టర్ యజమాని వేముల భాస్కర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌రెడ్డి పేర్కొన్నారు.

## ప్రతిఒక్కరూ సన్మార్గంలో నడవాలి: ఎమ్మెల్యే పోచారం

**అక్షరటుడే, కోటగిరి:** ప్రతిఒక్కరూ సన్మార్గంలో నడుచుకోవాలని, అప్పుడే భగవంతుడు కరుణిస్తాడని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండలంలోని అడ్కస్ పల్లిలో గల లింగమయ్య ఆలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఆలయంలో వేదపండితులు సోమవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ.. ఎక్కడైతే నిత్యం భగవంతుడికి పూజలు జరుగుతాయో.. ఆ ప్రాంతం సుభిక్షంగా ఉంటుందని అన్నారు. ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో అడుగులు వేయాలన్నారు. మనం ధర్మం వైపు నిలబడితే ఆ పరమాత్మ మనవైపు నిలబడతారన్నారు. లింగమయ్య ఆలయాన్ని పునర్నిర్మాణానికి కృషి ఆలయ కమిటీ చైర్మన్ మమ్మలనేని రాజశేఖర్‌ను అభినందించారు. అనంతరం ఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, భక్తులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.



## రెస్టారెంట్లలో తనిఖీలు

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని పలు రెస్టారెంట్లలో నిషేధిత ఉప్పు, సింథటిక్ ఆహార రంగులు వాడుతున్నట్లుగా గుర్తించామని జిల్లా ఆహార భద్రత అధికారి సునీత తెలిపారు. జిల్లా కేంద్రంలోని పలు ప్రముఖ హోటళ్లు, రెస్టారెంట్లను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొన్ని రెస్టారెంట్లు సరైన పరిశుభ్రత పాటించకపోవడం గమనించామన్నారు. ప్రధానంగా హానికర రంగులు వాడడం, పచ్చిమాంసం నిల్వ ఉన్న ఫ్రీజర్స్ ఉష్ణోగ్రతలు సరిగ్గా మెయింటెన్ చేయడం లేదన్నారు. దీంతో మాంసం కుళ్లిపోయే స్థితికి చేరుతోందన్నారు. కల్తీ ఆహారాన్ని గుర్తించిన హోటళ్లకు నోటీసులు జారీ చేశామని జిల్లా ఆహార భద్రత అధికారి తెలిపారు. అనుమానం వచ్చిన శాంపిళ్లను సేకరించి, రాష్ట్ర ఆహార ప్రయోగశాలకు పంపించినట్లు పేర్కొన్నారు. నివేదికలు వచ్చాక వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. రెస్టారెంట్ నిర్వాహకులు పరిశుభ్రతను పాటించాలని, నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు.





## కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

**అక్షరటుడే, ముప్కాల్ :** రైతులు మద్దతు ధర కోసం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని ఏపీఎం హిమబాల సూచించారు. ముప్కాల్ మండల కేంద్రంలోని నల్లూరు గ్రామంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రేడ్ ఏ వరి ధాన్యానికి రూ.2,389 మద్దతు ధర లభిస్తుందన్నారు. అలాగే సన్నాలకు రూ.500 బోనస్‌తో కలిపి రూ. 2,869 వస్తుందన్నారు. రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బరకం గంగాధర్, పూర్ణిశెట్టి రమణ, పతాని శ్రీనివాస్, ఫణిందర్ గౌడ్, పంచాయతీ సెక్రెటరీ విఘ్నేష్, సీసీ విక్రమ్ రెడ్డి, వీడీసీ సభ్యులు, మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## మౌలిక సదుపాయాలు కల్పించాలి

**అక్షరటుడే, బీర్కూర్:** మండల కేంద్రంలోని వైఎస్సార్ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కాలనీవాసులు కోరారు. ఈ మేరకు సోమవారం వారు ఎంపీడీవో కార్యాలయానికి తరలివచ్చారు. ఎంపీడీవో శ్రీనిధికి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తమ కాలనీ ఏర్పడి 14 ఏళ్లు గడుస్తున్నా మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని వాపోయారు. కాలనీలో ఎక్కడికక్కడ డ్రెయినేజీ నీరు నిలిచి దుర్వాసన వ్యాపించడంతో పాటు దోమల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్ల బయటకు రావడమే కష్టంగా మారిందని, డ్రెయినేజీలు లేక మురికి నీరు రోడ్డుపైనే నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలు సైతం ఇబ్బందిగా మారిందని వారన్నారు. రోడ్లు, డ్రెయినేజీలు లేకపోవడంతో కొత్త ఇళ్లు నిర్మించుకోలేకపోతున్నారన్నారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ భవనం నిరుపయోగంగా మారింది. ప్రణాళిక లేని పనుల కారణంగా ప్రజాధనం వృథా అయ్యింది. కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో ఎస్సీ గురుకుల వసతి గృహాన్ని విద్యార్థులు లేరనే కారణంతో మూసివేశారు. దీంతో ప్రస్తుతం ఆ భవనం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిపోయింది.

\- అక్షరటుడే, కమ్మర్‌పల్లి

# లక్షలు వెచ్చించి.. వృథాగా వదిలేసి..

▸ నిరుపయోగంగా ఎస్సీ హాస్టల్ ▸ రూ.80 లక్షలతో నిర్మాణం ▸ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం

కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో 2015లో రూ. 80 లక్షలతో షెడ్యూల్ కులాల వసతి గృహాన్ని నిర్మించారు. హాస్టల్‌లో గదులతో పాటు విద్యార్థులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు ఈ భవనంలో ఏర్పాటు చేశారు. అయితే 2015లో ప్రారంభమైన ఈ హాస్టల్ ముచ్చటగా మూడేళ్లు కూడా కొనసాగలేదు.

### నిరుపయోగంగా..

విశాలమైన గదులతో నిర్మించిన ఈ వసతిగృహం ప్రస్తుతం బూత్ బంగ్లాగా మారింది. రెండేళ్లు ఈ భవనంలో ఎస్సీ గురుకుల హాస్టల్ నడిచింది. కానీ విద్యార్థులు లేరనే సాకుతో హాస్టల్‌ను ఇక్కడి నుంచి ఎత్తేశారు. దీంతో హాస్టల్ భవనం ఖాళీ అయ్యింది. అప్పంటి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. హాస్టల్‌పై ఎలాంటి పర్యవేక్షణ లేకపోవడంతో రాత్రివేళ చోరీలు జరిగాయి. వసతిగృహం గదులకు ఉన్న డోర్లు, కిటికీ తలుపులు ఎత్తుకెళ్లారు. ఇనుపసామాగ్రి పూర్తిగా చోరీకి గురైంది.

### లోతట్టు ప్రాంతంలో కట్టడం..

అధికారుల అనాలోచిత నిర్ణయం కూడా హాస్టల్ మనుగడకు శాపంగా మారింది. ముఖ్యంగా రూ. 80లక్షలతో కట్టిన హాస్టల్ కోసం ఎంపిక చేసిన స్థలమే సరైంది కాదని స్థానికులు పేర్కొంటున్నారు. లోతట్టు ప్రాంతంలో హాస్టల్ నిర్మించడంతో చిన్నపాటి వర్షానికే భవనం చుట్టూ వర్షం నీరు చేరి హాస్టల్ లోకి వెళ్లలేని పరిస్థితులు ఉండేవి. అయినా అక్కడే భవనం నిర్మించారు. ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. అధికారులు స్పందించి హాస్టల్‌ను వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

### విద్యార్థులు లేక..

హాస్టల్‌ను నిర్మించినప్పటికీ విద్యార్థులు లేకపోవడంతో మిగితా విద్యార్థులను ఇతర హాస్టల్‌కు తరలించాల్సి వచ్చింది. ప్రస్తుతం హాస్టల్ వృథాగా ఉన్న విషయం వాస్తవమే. వచ్చే ఏడాది 50మందికి పైగా విద్యార్థులు చేరితే హాస్టల్‌ను తిరిగి ప్రారంభిస్తాం.

– రాజగంగారాం, ఏఎస్‌డబ్ల్యూవో

### ప్రజాధనం వృథా..

హాస్టల్ నిరుపయోగంగా మారడంతో ప్రజాధనం వృథాగా మారింది. రూ. 80లక్షలతో హాస్టల్ కట్టారు. రెండేళ్లు కూడా నడవలేదు. ప్రస్తుతం వసతిగృహం లేకపోవడంతో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల కు వసతి లేకుండా పోయింది. హాస్టల్‌ను పునరుద్ధరించాలి.

– భోగ రామస్వామి, వీడీసీ అధ్యక్షుడు

## కులంపేరుతో దూషించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** కులం పేరుతో దూషించిన లైన్‌మన్ రాములుపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బాన్సువాడ విద్యుత్‌శాఖ ఏడీఈకి సోమవారం వినతిపత్రం అందజేశారు. బాన్సువాడ పట్టణానికి చెందిన ఎస్సీ వర్గానికి చెందిన ట్రాన్స్‌కో లైన్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రాజేంద్రప్రసాద్‌ను తాడ్కోల్‌కు చెందిన లైన్‌మన్ రాములు కులం పేరుతో దూషించి అవమానపర్చారన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బంగారు మైషయ్య, మాల మహానాడు డివిజన్ నాయకుడు మల్లూరు సాయిలు, జిల్లా నాయకులు నెర్రె నర్సింలు, గైని రవి, మన్నె చిన్న సాయిలు, సాయిలు, రాజు, గున్న సాయిలు, గంగాధర్, వాగ్మారే మారుతి, మన్నె నాగభూషణం ఉన్నారు.

## ఎల్‌వోసీ అందజేత



**అక్షరటుడే, కామారెడ్డి:** అనారోగ్యంతో బాధపడుతున్న బాధిత కుటుంబానికి సోమవారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఎల్‌వోసీ అందజేశారు. భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన నీల ఆంజనేయులు కుమారుడు రాజేష్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని బాధిత కుటుంబ సభ్యులు, నాయకులు షబ్బీర్ అలీ దృష్టికి తీసుకెళ్లారు. దాంతో ఆయన నిమ్స్ వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం కోసం రూ.3 లక్షల ఎల్‌వోసీ కాపీని హైదరాబాద్‌లోని తన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా రాజేష్ కుటుంబ సభ్యులు షబ్బీర్ అలీకి కృతజ్ఞతలు తెలిపారు.


## మద్యం మత్తులో డ్రైవింగ్.. ఆరుగురికి జైలు

**అక్షరటుడే, కామారెడ్డి:** డ్రంకన్ డ్రైవ్ కేసులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన వారికి కోర్టు జరిమానాలు, జైలుశిక్షలు విధిస్తోంది. అయినప్పటికీ మందుబాబుల్లో మార్పు రావట్లేదు. దర్జాగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నారు. డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన 50 మందికి న్యాయస్థానం సోమవారం జరిమానాలు విధించింది. ఇందులో కామారెడ్డి, దేవునిపల్లి, తాడ్వాయి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆరుగురికి రూ.1,000 జరిమానాతో పాటు ఒకరోజు జైలుశిక్ష విధించింది. మాచారెడ్డి, సదాశివనగర్, భిక్కనూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో 44 మందికి రూ.1,000 చొప్పున రూ.44 వేల జరిమానా వేసింది.

## రియల్ ఎస్టేట్ వ్యాపారిపై చర్య తీసుకోవాలి

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలో అక్రమాలకు పాల్పడుతున్న రియల్ ఎస్టేట్ వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని న్యూ డెమోక్రసీ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి దాసు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్మూర్ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్‌కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియాకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రియల్ ఎస్టేట్ వ్యాపారి తీగల నర్సారెడ్డి ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని ఆరోపించారు. ఆ స్థలాన్ని వెంటనే కబ్జా నుంచి విడిపించి పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టించాలని డిమాండ్ చేశారు. ఆర్మూర్ పట్టణ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో సర్వేనెంబర్ 202/3 ప్రభుత్వ భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆక్రమించి 24 ఇళ్లు నిర్మిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ ఆర్మూర్ డివిజన్ నాయకులు బి.సూర్య శివాజీ, అబ్దుల్, బాలయ్య, దేవన్న, ప్రజా సంఘాల నాయకులు ఆర్.బాబురావు, వెంకటేష్, నరేందర్, హుస్సేన్, వర్ణారెడ్డి, రాహుల్, పోశెట్టి, సూరిబాబు, నిమ్మల భూమేశ్, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ కాయిల్స్ చోరీ



**అక్షరటుడే, పెద్ద కొడప్‌గల్ :** విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆయిల్, కాపర్ వైర్లు చోరీకి గురయ్యాయి. ఈ ఘటన మండలం శివారులో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..పెద్దకొడప్‌గల్ శివారులోని పంటపొలాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అందులోని కాపర్ వైర్లు, ఆయిల్ చోరీ చేశారు. దీంతో రైతులు, పోలీసులకు, విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించారు. స్థలానికి వెళ్లిన పోలీసులు క్లూస్‌టీం ద్వారా వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అరుణ్‌కుమార్ పేర్కొన్నారు.

## పీడీఎస్ బియ్యం పట్టుకున్న పోలీసులు




**అక్షరటుడే, మెండోరా:** మండలంలోని బుస్సాపూర్ గ్రామ శివారులో పోలీసులు పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఎస్సై సుహాసిని తెలిపిన వివరాల ప్రకారం.. పీడీఎస్ బియ్యాన్న తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో తనిఖీలు చేశారు. ఓ వ్యాన్‌లో 46 క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై సుహాసిని మాట్లాడుతూ.. వ్యాన్‌ను సీజ్ చేశామని.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

## ఎడపల్లి మండలంలో..




**అక్షరటుడే,బోధన్:** పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న వ్యాన్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు ఎడపల్లి ఎస్సై రమ వివరాలు వెల్లడించారు. నిజామాబాద్ నుంచి బోధన్ వైపునకు పీడీఎస్ బియ్యం తరలిస్తున్నారనే పక్కా సమాచారంతో ఎడపల్లి రైల్వేట్రాక్ వద్ద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సుమారు 15 క్వింటాళ్ల వరకు పీడీఎస్ బియ్యాన్ని ఐచర్ వాహనంలో తరలిస్తుండగా పట్టుకుని వాహనాన్ని సీజ్ చేశామని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆమె వివరించారు.

## మట్టిలో మాణిక్యం.. కవి అందెశ్రీ: బోధన్ జేఏసీ



**అక్షరటుడే, బోధన్:** తెలంగాణ కవి, రచయిత అందెశ్రీ మట్టిలో మాణిక్యం అని బోధన్ జేఏసీ ప్రతినిధులు పేర్కొన్నారు. అందెశ్రీకి మృతికి సంతాపంగా ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలోని అమర వీరుల స్థూపం వద్ద జేఏసీ ప్రతినిధుల ఆధ్వర్యంలో నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ జేఏసీ కన్వీనర్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ.. అందెశ్రీ స్కూల్‌కు వెళ్లకపోయినా గొప్ప సాహితీవేత్తగా పేరు గడించారన్నారు. చిన్నతనంలో గొర్ల కాపరిగా, భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేసినప్పటికీ సామాజిక స్పృహతో శ్రామిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించేవారన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో భాగంగా బోధన్ పట్టణంలో 1,519 రోజులు నిరాహార దీక్ష చేసిన సమయంలో అందెశ్రీ బోధన్‌కు వచ్చి ఉద్యమానికి మద్దతు తెలిపారన్నారు. కార్యక్రమంలో జేఏసీ ప్రధాన కార్యదర్శి బి.మల్లేష్, నాయకులు అడ్వకేట్ శ్యాంరావు, సాయిబాబా గౌడ్, సుధాకర్ చారి, అడ్వొకేట్ హనుమంతరావు, విద్యాసాగర్, జి.సీతారాం, ఎస్కే కాజా, అంజాద్ ఖాన్, ఎస్‌కే నజీర్, ఈర్షద్, గాండ్ల రాములు పాల్గొన్నారు.

## అందెశ్రీకి బార్ అసోసియేషన్ నివాళులు

**అక్షరటుడే, ఆర్మూర్:** ప్రజాకవి అందెశ్రీకి ఆర్మూర్ బార్ అసోసియేషన్ సభ్యులు నివాళులర్పించారు. పట్టణంలోని బార్ అసోసియేషన్ హాల్‌లో అధ్యక్షుడు జక్కుల శ్రీధర్, ప్రధాన కార్యదర్శి జెస్సు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో అందెశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రజాకవి, తెలంగాణ ఉద్యమ కెరటం, తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందెశ్రీ అకాల మరణం తెలంగాణ రాష్ట్రానికి తీరని లోటన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గట్టడి ఆనంద్, సంయుక్త కార్యదర్శి మద్దుల గంగారాం, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.




## తెలంగాణ వర్సిటీలో అక్రమ నియామకాలపై దర్యాప్తు జరిపించాలి



**అక్షరటుడే, డిచ్‌పల్లి:** తెలంగాణ యూనివర్సిటీలో అక్రమ నియామకాలపై తక్షణమే దర్యాప్తు చేయించాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి రాజుగౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ యూనివర్సిటీలో 2012లో జరిగిన అక్రమ నియమకాలను రద్దు చేస్తూ ఇటీవల హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. అయినప్పటికీ తీర్పును ఉల్లంఘిస్తూ.. జడ్జిమెంట్ కాపీ తమకు అందలేదనే సాకుతో అక్రమంగా నియమితులైన వారిని కొనసాగించడం ఎంతవరకు సబబని ఆయన ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వీసీపై కోర్టు ధిక్కరణ కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ యూనివర్సిటీలో 2012లో అప్పటి వీసీ, రిజిస్ట్రార్ ఎలాంటి నియమ, నిబంధనలు పాటించకుండా దొడ్డిదారిన తమకు నచ్చిన వ్యక్తులకు నియమక పత్రాలు అందజేశారని రాజుగౌడ్ ఆరోపించారు. అవినీతి అధికారులకు అండదండలు అందిస్తున్న యూనివర్సిటీ అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పూర్తిస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అక్రమ నియామకాలకు బాధ్యులైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, దుర్వినియోగమైన రూ.కోట్లల్లో నిధులను రికవరీ చేయాలన్నారు. బాధ్యులను పూర్తిగా సర్వీసు నుంచి రిమూవ్ చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు డి.నాగరాజు, జవారి రాహుల్, ఆర్.రాజన్న, బి.రవీందర్ గౌడ్, ఆదిత్య పాల్గొన్నారు.